# మనిషి

తెల్లవారురఝూమున ఐదు గంటలు దాటింది. వేసవికాలం సమీపిస్తోందేమో, మసక వెల్తురు వస్తోంది. అలవాటు ప్రకారం శర్మగారు, షికారుకి బయలుదేరారు. వాన కురుస్తూంటే తప్ప, అది ఎండాకాలమైనా, చలికాలమైనా, ఉదయం, సాయంత్రం నియమంగా షికారుకి వెళ్లడం ఆయనకు అలవాటు. అందుకేనేమో అర్వై ఏళ్ళు దాటినా శర్మగారి ఆరోగ్యం చెక్కుచెదరలేదు. పాతతరం మనిషి కనుకనే ఇంకా ఆయనకి అటువంటి అలవాట్లు ఉన్నాయి. అదే ఈ రోజుల్లో అయితే షికారుకి వెళ్లేవాళ్లు ఎవరూ కనిపించరు.

శర్మగారిని చూస్తేనే శుద్ధ శ్రోత్రియ కుటుంబానికి చెంది మనిషని చెప్పకనే తెలుస్తుంది. తలమీద నలుపు, తెలుపు వెంట్రుకలు కలిపిన పిలక, ముఖాన విభూది, దానిమీద గుండ్రని పెద్ద కుంకుమ బొట్టు, మెళ్లో రుద్రాక్షమాల, బిళ్ల గోచి పంచ, పైన అడ్డంగా కప్పుకొన్న ఖద్దరు శాలువ, ఇవన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని వ్యక్తం చేస్తుంటాయి. సుమారు రెండు మైళ్ళు అల్లా నడిచి, నదివరకు వెళ్లి అక్కడే కాలకృత్యాలు తీర్చుకొని, నదిలో స్నానం చేసి, నది ఒడ్డున సంధ్యావందనం కానిచ్చుకొని, జపం చేసుకుంటూ తిరిగి ఇంటికి రావడం, ఆయన దినచర్యలో ప్రథమ భాగం.

శర్మగారు మామూలుగా రోడ్డుమీద నడుస్తున్నారు. అలవాటుగా ఆయన చేతిలో కర్రని పుచ్చుకున్నారు కాని, నిజానికి దాని అవసరం, ఆయనకు లేదు. మనస్సులోనే దైవధ్యానం చేసుకుంటూ నడుస్తున్నారు ఆయన. రోడ్డుమీద ఎక్కడా జన సంచారం లేదు. చల్లని పిల్లగాలి దేహాన్ని నిమురుతూ, మనస్సుకి ఎంతో హాయిని కొలుపుతోంది.

మరి కొంచెం దూరం సాగేసరికి, శర్మగారికి రోడ్డుమీద వంగునివున్న ఒక పిల్లవాడు కనిపించాడు. వాడి ప్రక్కన ఒక తట్ట వుంది. అందులో దేనినో ఎత్తి వేస్తున్నాడు. ఇంకొంచెం ముందుకి వెళ్లేసరికి వాడు చేస్తున్న దేమిటో ఆయనకి స్పష్టంగా కనిపించింది. ఆ దృశ్యం చూస్తూనే 'శివ .... శివా' అనుకుంటూ కళ్ళు మూసుకున్నారు శర్మగారు.

ఆ కుర్రవాడు తట్టలో మేక మాంసం మేస్తున్నాడు. మాంసం తట్ట నెత్తిమీద పెట్టుకువస్తుంటే, అది క్రింద పడిపోయినట్టుంది. కోసేసిన రెండు మూడు మేకలు అందులో వున్నాయి. ఆ పిల్లవాడికి గట్టిగా పదేళ్ళు వున్నాయో లేదో! కాకీ నిక్కరూ, నీలం చొక్కా వేసుకొని ఉన్నాడు. కొంచెం సేపటి క్రితమే ఆ మేకలని కోశారేమో, వాటి నెత్తురు వాడి తలమీద, బట్టలమీద పడి, ఇంకా తడి ఆరకుండానే ఉంది. వాడి చేతులు కూడా రక్తంతో తడిసి ఎర్రగా ఉన్నాయి ఆ దృశ్యం చూసేసరికి శర్మగారి మనస్సు ఆ మేకల కోసం తల్లడిల్లి పోయింది. ఆ నెత్తుటి మరకలు, మాంసం చూసేసరికి ఆయనకి వాంతి వచ్చినంత పని అయింది. దృష్టిని మరల్చుకొని, దైవధ్యానం గట్టిగా చేసుకుంటూ ముందుకి

సాగారు. ఆయన వెళ్తుంటే, ఆయన వంక, ఆ కుర్రవాడు ఎందుకో ఆశగా చూశాడు. ఆయనే దానిని గమనించనే లేదు.

శర్మగారు, గట్టిగా పది అడుగులు వేశారో లేదో, వెనకాల నుంచి "సాబ్" అన్న పిలుపు వినిపించింది. వెనక్కి తిరిగి చూశారు ఆయన. ఆ కుర్రవాడు తప్ప ఎవ్వరూ కనిపించలేదు. తాను భ్రమపడ్డాడనుకుని మళ్ళీ ముందుకు సాగాడు ఆయన.

"సాబ్ - సాబ్?" అంటూ మళ్ళీ పిలుపు వినిపించింది. చిరాగ్గా వెను దిరిగారు శర్మగారు. "సాబ్ .... మిమ్మల్నే" అంటూ కొంచెం ముందుకు వచ్చాడు ఆ కుర్రవాడు.

"ఏమిట్రా ... నాతో నీకేం పని?" అంటూ నాలుగడుగులు వెనక్కివేసి గదమాయించి అడిగాడు శర్మగారు.

"సాబ్ ... కొంచెం తట్ట ఎత్తండి. బరువుగా వుంది. నేను ఎత్తలేక పోతున్నాను" అన్నాడు, ఆ కుర్రవాడు భయంగా.

"బుద్ధిలేని వెధవా ... ఒళ్లు కొవ్విందా? నన్నా అడుగుతూంట! బుద్ధి జ్ఞానం లేని వెధవా' ' అంటూ తిట్ల వర్షం కురిపించారు శర్మగారు.

"అరగంట పైనుంచి చూస్తున్నాను ఎవరైనా వస్తారేమోనని. కాని ఎవ్వరూ రావడం లేదు. నేను ఎత్తుకుంటుంటే క్రింద పడిపోతోంది. కొంచెం తట్ట ఎత్తి నెత్తిన పెడ్తే తీసుకు పోతాను" అన్నాడు ఆ కుర్రవాడు.

"అయితే నేనేం చేస్తాను .... అది నేను ముట్టుకుంటానా? ఎవరేనా వచ్చేవరకు ఉండు' ' అన్నాడు శర్మగారు.

"ఎవ్వరూ రావడం లేదు సాబ్ .... అందుకే మిమ్మల్ని అడిగాను. ఆలస్యం అయితే మా సేట్ కొడ్తాడు" అన్నాడు ఆ పిల్లవాడు. ఆ మాటలు అంటుంటే వాడికి ఏడుపు రాబోయింది.

"పో .... పో...:" అంటూ వెనుతిరిగి ఆయన ముందుకు సాగాడు. ఆ పిల్లవాడిని కసురుకున్నాడే గాని, వాడిని చూస్తే, ఆయనకి ఎంతో జాలివేసింది.

"పాపం .... పట్టుమని పదేళ్లులేని ఆ పసివాడికి ఏమిటీ శిక్ష? ఆడుతూ పాడుతూ చదువుకుంటూండ వలసిన వయస్సులో ఈ బరువు బాధ్యత లేమిటి? చీకట్లో లేచి ఇంతదూరం వచ్చి ఈ బరువుని మోసుకొని ఎంత దూరమో వెళ్తాడు. ఇదంతా పొట్టకూటి కోసమే కదా? పూర్వజన్మలో ఎంతో పాపం చేసుకుంటేనే కాని, ఈ ప్రారబ్ధం సంభవించదు" - ధ్యానాన్ని ఆవలికి నెట్టి, ఆలోచనలు శర్మగారి మనస్సుని ఆక్రమించాయి. వెనకాల నుంచి బిగ్గరగా ఏడుపు వినిపించింది. దాంతో శర్మగారి ఆలోచనలకు అంతరాయం కలిగింది. వెనకాలకి తిరిగిచూస్తే, ఆ కుర్రవాడే తట్ట ప్రక్కన కూర్చుని బిగ్గరగా ఏడుస్తున్నాడు. శర్మగారి వంక చూస్తూ. "పాపం వాడికేమైందో! ఏ దెబ్బేనా తగిలిందో ఏమో!" అనుకున్నారు ఆయన. "ఏమైతే మాత్రం నేను చేయగలిగింది ఏమిటి?' ' అని మళ్ళీ అనుకొని ముందుకు అడుగేశాడు.

ఆ పిల్లవాడి ఏడుపు స్థాయి హెచ్చింది.

ఆ ఏడుపు వింటూంటే శర్మగారి మనస్సు వ్యాకుల పడింది. "అసలు ఏం జరిగిందో తెలుసుకుందాం" అనుకున్నారు ఆయన. వడిగా అడుగులే వేస్తూ వాడిని సమీపించారు. "ఎందుకురా ఏడుస్తున్నావు? ఏం జరిగింది. ఏమైనా దెబ్బ తగిలించుకున్నావా ఏమిటి?" అని అడిగాడు. "లేదు సాబ్. ఆలస్యం అయిపోతోంది. మా సేట్ నన్ను చంపేస్తాడు. ఇవాళ పండగ గిరాకి ఉందని

రోజుకన్నా ఎక్కువ మాంసం తెమ్మన్నాడు. త్వరగా తెమ్మన్నాడు. ఈ తట్ట నేను ఎత్తుకోలేక పోతున్నాను. ఆలస్యం అయితే మా సేట్ నన్ను కైమా చేసేస్తాడు!" అంటూ ఎక్కుతూ చెప్పాడు వాడు.

వాడి పరిస్థితి చూస్తే శర్మగారికి ఎంతో జాలివేసింది. ఆ పసివాడిని వాడి సేట్ చావకొట్టటం ఊహించుకుంటే ఆయన హృదయం ద్రవించిపోయింది. అసలు ఆయనది జాలిగుండె. ఏ జీవికి ఎంత చిన్న కష్టం వచ్చినా ఓర్వలేడు. కళ్లముందు ఆ పసివాడు పడుతున్న బాధ చూస్తుంటే ఆయన భరించలేక పోతున్నాడు. కాని తాను నిస్సహాయుడు. చూస్తూ చూస్తూ ఆ మాంసం తట్టని తాను ఎలా ముట్టుకోగలడు? దానిని ముట్టుకుంటే తన బ్రాహ్మణ్యం ఏమయ్యేటట్లు? తాను అపవిత్రుడైపోడూ? నిస్సహాయంగా వెనుదిరిగి, నెమ్మదిగా నడవసాగారు.

ఆ పిల్లవాడి ఏడుపు బిగ్గరగా వినిపిస్తూనే ఉంది. ఎవరైనా కనిపిస్తారేమోనని శర్మగారు ముందూ వెనకా పరకాయించి చూశారు. కాని ఎవరూ కనిపించలేదు. ఆ పిల్లవాడి ఏడుపు ఆయన హృదయాన్ని రంపపుకోత కోస్తోంది. ఆయన అంతరంగంలో సంఘర్షణ చెలరేగింది. ఆయనకి ధర్మవ్యాధునికథ జ్ఞాపకానికి వచ్చింది. "ధర్మవ్యాధుడు కటికవాడు. మాంసాన్ని అమ్ముకుని జీవించేవాడు. అది అతని వృత్తి ధర్మం. అయినా అతను మహా జ్ఞాని. ధర్మ సూక్ష్మాలను బాగా ఎరిగిన వాడు. అందుకే కౌశికుని వంటి అహంకార తపస్వికి కనువిప్పు కలిగించాడు. అలాగే ఈ బాలుడూ వృత్తి ధర్మాన్ననుసరించి, మాంసం తట్టను మోస్తున్నాడు. అందులో తప్పేమి ఉంది? కష్టసుఖాలు అందరికీ సమానమే. అదే ఏ కూరగాయల తట్టో అయితే, తాను ఇల్లా ఆలోచించేవాడా? వెంటనే వాడికి సహాయం చేసేవాడు కాదూ! అప్పుడు ఉండే మానవత్వం ఇప్పుడు ఏమైంది. కష్టంలో ఉన్న మనిషికి అందులో పసిబాలుడికి సహాయం చేయగలిగీ, చేయక పోవడం మానవత్వమనిపించు కుంటుందా?' మరి వాడికి సహాయం చేస్తే తన బ్రాహ్మణ్యం ఏమవుతుంది? బ్రాహ్మణ్యం కోసం చూడడమా, మానవతని మన్నించడమా? అసలు బ్రాహ్మణ్యం అంటే ఏమిటి? నిజానికి బ్రాహ్మణునికి ఉండవలసిన లక్షణాలు జాలి, దయ, పరోపకారం, విశ్వమానవ శ్రేయస్సు వంటివి. మరి అసహాయుడై ఉన్న ఈ బాలునికి సహాయం చేస్తే తన బ్రాహ్మణ్యం పోతుందా? తాను అపవిత్రుడు అవుతాడా? శర్మగారి మస్తిష్కంలో ఆలోచనల తుపాను రేగుతోంది. ఆ కుర్రవాడి ఏడుపు అంతకంతకీ ఎక్కువ అవుతోంది.

శర్మగారిలోని మానవుడు మేల్కొని బయటికి రావటానికి ఉరకలు వేస్తున్నాడు. చివరికి ఆ మానవుడే జయించాడు. దృఢ నిశ్చయంతో శర్మగారు వెనుదిరిగారు. వడివడిగా ఆ పిల్లవాడి దగ్గరకు వెళ్లారు. ఏమీ మాట్లాడకుండా ఆ తట్టను రెండు చేతులతో ఎత్తారు.

ఏడుపు మానివేసి ఆశ్చర్యంతో నుంచున్నాడు ఆ కుర్రవాడు. ఆ తట్టని జాగ్రత్తగా వాడి నెత్తిన పెట్టారు శర్మగారు. దానిని పదిలంగా పట్టుకొని "సుక్రియా" అంటూ ముందుకి సాగిపోయాడు ఆ బాలుడు.

ఉదయభానుడు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాడు. ఆకుర్రవాడు వెళ్లిపోతుంటే శర్మగారి మనస్సు తృప్తితో నిండిపోయింది. ఒక మంచిపని చేసినందుకు కలిగిన అలౌకిక ఆనందం, ఆయన మనస్సుని ఆక్రమించింది. నెత్తురు అంటిన చేతులను చేసుకొని చిరునవ్వు నవ్వుకున్నాడు. త్వరత్వరగా నదికి నడిచివెళ్ళి సచేల స్నానం చేసి గాయత్రీ మంత్రం జపించి ఇంటిముఖం పట్టారు ఆయన, అనిర్వచనీయమైన ఆత్మ సంతృప్తితో.

*(యోజన 1-14, నవంబర్ 1977)*